క్లుప్తంగా

వైభవంగా ఉర్సు



కోటవురట్లలో సందల్ ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలో ఆదివారం హజరత్ ఖాదర్ వలీ ఔలియా ఉర్సు సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. మజీద్ ఉస్మాన్ ఘనీ, నవ జవాన్ యూత్ ఆధ్వర్యంలో ఉర్సును ఘనంగా నిర్వహించి, సందల్ ఊరేగింపు చేశారు. సలాతు సలాం, ఫాతెహా, సర్కార్ జెండా ఆవిష్కరణ, తబురుఖ్ కార్యక్రమాలు చేపట్టారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వాకపాడులో 'గడప గడపకు'

ఎస్.రాయవరం: మండలంలోని వాకపాడు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరవుతారని చెప్పారు. ఈ మేరకు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది విధిగా హాజరు కావాలని సూచించారు.

టెన్త్ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందిస్తున్న సురేష్

కోటవురట్ల: ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకుని, విజయాలు సాధించాలని అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు అల్లాడ సురేష్ అన్నారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులకు ట్రస్ట్ తరఫున ఆదివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థునులకు ట్యాబ్‌లు బహుమతిగా అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రాజ్యలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నేవీ నిర్వాసితుల ధర్నా



నేవీ మెయిన్ గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న నిర్వాసితులు

రాంబిల్లి: తమ డిమాండ్లు నెరవేర్చాలని నేవీ నిర్వాసితుల ఐక్య వేదిక నాయకులు కోరారు. నేవీ మెయిన్‌గేటు వద్ద నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితుల ధర్నా ఆదివారం 70వ రోజు కొనసాగింది. వాడనర్సాపురం, కొప్పుగొండుపాలెం, కొత్తపట్నం, నేవీ పునరావాసకాలనీ, వాడపాలెం, గోవిందపాలెం, చినకవలాపల్లి, కొత్తపేట గ్రామాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డి దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డి

కోటవురట్ల: విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చెలేరి ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డి దగ్ధమైంది. కోటవురట్లకు చెందిన రైతు కశిరెడ్డి నానాజీ వరి నూర్పు అయ్యాక గడ్డిని ట్రాక్టరు పై పాడి పశువులు ఉండే మకాం వద్దకు తీసుకెళుతుండగా విద్యుత్ తీగెలకు తగలడంతో మంటలు చెలరేగాయి. స్థానికంగా ఉన్న యువకులు పొక్లెయిన్‌తో గడ్డిని తొలగించి, మంటలను ఆర్పారు. యువకులు సకాలంలో స్పందించి ట్రాక్టర్‌కు మంటలు వ్యాపించకుండా కాపాడారు. రైతుకు సుమారు రూ.6 వేలు నష్టం జరిగింది.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

- ఉత్సాహం నింపిన నియోజకవర్గస్థాయి సమావేశం
- వేలాదిగా హాజరైన కార్యకర్తలు
- దిశానిర్దేశం చేసిన అగ్రనేతలు



అభివాదం చేస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

నక్కపల్లి/పాయకరావుపేట: పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అధ్యక్షతన జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి సమావేశం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. తొలిసారిగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి నియోజకవర్గంలోని నలుమూలల నుంచి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు, పార్టీ తరఫున ఎన్నికైన ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. జాతీయ రహదారి పక్కన పోలీస్‌స్టేషన్ ఎదురుగా రఘుపతి కల్యాణ మండపం ప్రాంగణంలో వేలాదిమంది కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన సభాప్రాంగణం నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. అగ్రనేతలంతా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్రమంత్రి దాడి శెట్టిరాజా, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బి.వి.సత్యవతి తదితర అతిరథ మహారథులు హాజరై కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. నాలుగు మండలాలనుంచి ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసుకుని వేలాది మంది కార్యకర్తలు ఈ సభకు తరలివచ్చారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులు ఈ జనసమూహాన్ని చూసి ఆశ్చర్యపో యారు. టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గొల్ల బాబూరావును గెలిపించారని, అదే స్ఫూర్తితో రానున్న 2024 ఎన్నికల్లో కూడా విజయం సాధించి, రెండో సారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని అగ్రనేతలంతా దిశానిర్దేశం చేశారు. సచివాలయ పరిధి కన్వీనర్లు, గృహసారథుల నియామకం, ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే విధానం, ప్రతిపక్షాల విమర్శలను ఏవిధంగా తిప్పికొట్టాలనేదానిపై కార్యకర్తలకు సూచనలు చేశారు. అందరూ కలసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలంటూ టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి నాలుగు మండలాల నేతల చేతులను, ఎమ్మెల్యేతో చేతిలో వేయించారు. నేతలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని నక్కపల్లి, పాయకరావుపేట మండలాల నాయకులు గజమాలలతో సత్కరించారు. ఈసమావేశంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ వి.లక్ష్మణ్, లంకసూరిబాబు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పట్టణ శాఖ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మేజర్ పంచాయతీ సర్పంచ్ గారా ఉషశ్రీప్రసాద్, ఉప సర్పంచ్ జగతాభవానీ శ్రీనివాస్, పాపారావు,శీరం నర్సింహమూర్తి, పోలిశెట్టి పెద ఈశ్వరరావు,నూకినాయుడు, బి.బాబ్జి,డి.నానాజీ, కె.సత్తిబాబు,జి బాబూరావు, రాజ జేష్ఠఖన్నా,ఆప్కాఫ్ వైస్ చైర్మన్ మాతాగురునాథరావు,మహిళానాయకులు సుందరలత, శేషారత్నం,శ్రీదేవి,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు

గరుడ వాహన గోవింద



గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉపమాకలో వేంకటేశ్వరస్వామివారిని లక్క గరుడ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేషపూజలు జరిపారు.అనంతరం కొండదిగువన ఉత్సతమూర్తులకు, ఆండాళ్లమ్మవారికి, వేణుగోపాలస్వామికి నిత్యార్చనలు పూర్తిచేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 22వ పాశురాన్ని విన్నపం చేశారు.అనంతరం నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్ఠి నిర్వహించారు, లక్క గరుడ వాహనంలో ఉభయ దేవేరులతోకూడిన స్వామివారిని పల్లకిలో అమ్మవారిని ఉంచి తిరువీధి సేవలకు తీసుకెళ్లారు. రాత్రి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారిని పల్లకిలోఉంచి తిరువీధిసేవలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, గోపాలాచార్యులు,శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న షాపులపై కేసులు



షాపులను తనిఖీ చేస్తున్న మహిళా పోలీసు వరలక్ష్మి

మునగపాక: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మునగపాక సచివాలయ మహిళా పోలీసు వరలక్ష్మి కోరారు. పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ కవర్లను వినియోగించడం సరికాదన్నారు. స్థానికంగా పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న షాపులపై ఆదివారం కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిథిన్ కవర్లను వినియోగించే వారిపై చర్యలు తప్పవన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1995–96లో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు రాహుల్‌గాంధీ కల్యాణమండపంలో ఆదివారం కలుసుకున్నారు. 280 మందికి పైగా కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. నాడు విద్య నేర్పిన గురువులను గుర్తుకు తెచ్చుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఆత్మీయ కలయికకు మాడెం జోగారావు, ఆనంద్‌బాబు,ఆడారి నూకచంద్ర రామారావు,పొలమరశెట్టి జగ్గప్పలనాయుడు,గుడే శివగణేష్, పొలిమేర దేవకి,పెంటకోట లక్ష్మణరావు, మొల్లి అప్పలనాయుడు తదితరులు నేతృత్వం వహించారు.

రక్తదానానికి విశేష స్పందన



శిబిరంలో రక్త దాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కశింకోట : స్థానిక కస్పావీధిలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన దధీచి స్వచ్ఛంద రక్త దాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 54 మంది రక్తదానం చేశారు. విశ్వ హిందూ పరిషత్, వివేకానంద విజ్ఞాన పరిషత్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రముఖ వైద్యుడు జి.వి.సత్యనారాయణరావు ప్రారంభించారు. విశాఖలోని ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు నుంచి వైద్య, ఆరోగ్య సిబ్బంది హాజరై దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ కలగా లక్ష్మి హాజరై మాట్లాడుతూ రక్తదానం ప్రాణాపాయం నుంచి రక్షించి ప్రాణాన్ని నిలబెడుతుందన్నారు. రక్తదానం చేయడానికి యువకులు, దాతలు ఉత్సాహంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కరక సోమునాయుడు, దాసరి సన్యాసినాయుడు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు తదితరులు హాజరై రక్త దాతలను అభినందించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు శిష్టి అప్పారావు, ప్రధాన కార్యదర్శి వై.ఎ.రాజు, కోశాధికారి సీతారాం, వివేకానంద విజ్ఞాన పరిషత్ గౌరవాధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అధ్యక్షుడు జనపురెడ్డి హరనాథరావు, ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి నూకేశ్వరరావు, కోశాధికారి కె.వి.రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండబాబు మాస్టార్, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో హుండీ చోరీ

ఎస్.రాయవరం: చినగుమ్ములూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లి, అందులో ఉన్న సుమారు రూ.30 వేల నగదు చోరీ చేసినట్టు సర్పంచ్ గాడి అప్పలనరసింహ తెలిపారు. ఆదివారం యథావిధిగా భక్తులు ఆలయానికి వెళ్లగా హుండీ కనిపించలేదు. దీంతో వారు సర్పంచ్‌కి సమాచారం అందజేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాద్‌రావు క్లూస్ టీమ్‌ను తీసుకువచ్చి వేలి ముద్రలు సేకరించారు. దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

నూకాంబిక అమ్మవారి నగర సంకీర్తన



నూకాంబిక అమ్మవారి ఫొటోతో నగర సంకీర్తనలో భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం తెల్లవారుజామున నగర సంకీర్తన ప్రారంభమయింది. దేవదాయ ధర్మదాయ శాఖ జిల్ల కమిషనర్ బుద్ద మహలక్ష్మినగేష్ ఆదేశాల మేరకు పోతురాజు సిండికేట్ ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి ఫొటోను చేతబూని గవరపాలెం పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారి ఫొటోను ఆలయంలో నిలిపారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రతినెల మొదటి ఆదివారం అమ్మవారికి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిండికేట్ బృందం సభ్యులు ఉమామహేష్, తారకేష్, రెడ్డి పెంటయ్యనాయుడు, రామగణేష్, వరలక్ష్మి, కామేశ్వరి, పద్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహాభారత పఠనంతో మనోవికాసం


- పిల్లల కథల పుస్తకాల ఆవిష్కరణలో వక్తలు



రామ్మోహనరావు రచనలను ఆవిష్కరిస్తున్న అతిథులు

అనకాపల్లి రూరల్: పట్టణంలో తెలుగుభాషా పరిరక్షణ సమితి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వడ్లమూరి గంగాధరం జ్ఞాపకార్థం మహాభారతంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు విశేష స్పందన లభించింది. ముందుగా తెలుగుభాష పరిరక్షణ సమితి అధ్యక్షులు కొయిలాడ రామ్మోహన్‌రావు రచించిన కథల సంపుటిలు చిత్రకథానందనం, చిత్రకథాకేళి పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథులుగా ముద్రు ముత్యాలనాయుడు, నారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ వాసవీ బాలవిహార్, హిమశేఖర్ విద్యాసంస్థల నుంచి తనకు మంచి ప్రోత్సాహం లభించిందన్నారు. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మహాభారతంపై కనీవినీ, ఎరుగని రీతిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. పిల్లలు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా మహాభారతాన్ని చదివితే విలువలు పెరుగుతాయని, వక్తిత్వ వికాసం కలుగుతుందని, మానవీయ లక్షణాలు అలవడుతాయని చెప్పారు. ప్రొఫెసర్ ముద్రు ముత్యాల నాయుడు తెలుగు భాష ఆవశ్యకత గురించి మాట్లాడుతూ మాతృభాష, మాతృభూమి, మాతృమూర్తి.. ఈ మూడింటినీ ఎవరూ మరువకూడదన్నారు. రామ్మోహన్‌రావు కథలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా, ఆదర్శనీయంగా ఉంటాయన్నారు.

గ్రామాల్లోనూ డీవీఎంసీ కమిటీలు



మధుబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఏలు

అనకాపల్లిటౌన్ : ఎస్సీ, ఎస్టీలపై దాడులు ఎక్కువగా భూ సమస్యల వల్ల జరుగుతున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా రెవెన్యూ అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్టు జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ(డీవీఎంసీ) సభ్యుడు రేబాక మధుబాబు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ ప్రైవేట్ పంక్షన్ హాల్లో అనకాపల్లి డివిజన్ వీఆర్‌ఏల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి డీవీఎంసీ కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. రెవెన్యూలో భూసమస్యలు పరిష్కరించాలంటే వీఆర్వోలు, వీఆర్‌ఏల పాత్ర ఎంతో ఉందన్నారు. పోలీస్ స్టేషన్లలో ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం మండల వీఆర్‌ఏలు మధుబాబుకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో డివిజన్ వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు తోటాడ సింహాచలం, సభ్యులు శివగణేష్, అప్పారావు, బత్తిన కిషోర్, లోవరాజు, బాలాజీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల సమస్యలపై వై.వి. సుబ్బారెడ్డికి వినతి



సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి నేవీ నిర్వాసితుల ఐక్యవేదిక నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. 70 రోజులుగా ధర్నా నిర్వహిస్తున్నామని, తమ డిమాండ్లు నెరవేర్చాలని ఐక్యవేదిక నాయకుడు కొవిరి రామకృష్ణ తదితరులు సుబ్బారెడ్డిని కోరారు. ముఖ్యమంత్రి దృష్టికి మరోసారి ఈ విషయాన్ని తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చేస్తానని సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్టు రామకృష్ణ తెలిపారు.

410 మందికి నేత్ర పరీక్షలు



బ్రాండిక్స్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 410 మందికి కంటి పరీక్షలు చేశారు. 308 మందికి కళ్లద్దాలు అందజేసి, 120 మందికి మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స చేసుకోవాలని 99 మందికి సూచించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 10 మంది చిన్నారులు ఉన్నారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి వచ్చిన వారికి ఫలహారం, మజ్జిగ, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించారు.ఈ సందర్భంగా బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ 98 కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించామని తెలిపారు.ప్రజల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం తమకు సంతోషంగా ఉందన్నారు.

22న నవోదయ నమూనా పరీక్ష



నవోదయ నమూనా పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మునగపాక: స్థానిక గౌతమ పఠన మందిరంలో ఈ నెల 22న నవోదయ నమూనా పరీక్ష నిర్వహించనున్నట్టు మందిర కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆదివారం గౌతమపఠన మందిరం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.1000 అందజేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20లోగా పరీక్ష రుసుం రూ.20 చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 87128 95128, 88971 51427 అనే ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠనమందిరం సభ్యులు మారిశెట్టి అప్పారావు,కోనపల్లి రామ్మోహనరావు, దాడి అప్పలనాయుడు, ఆడారి సన్యాసినాయుడు,శివకోటి దుర్గా ప్రసాద్, ప్రణతి స్కూల్ కరస్పాండెంట్ ఆడారి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన తిరుమల యాత్ర



తిరుమల వెళ్లి తిరిగి వచ్చిన భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో అచ్యుతాపురం సబ్ డివిజన్ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవారి దర్శనానికి ఉచిత బస్సుల్లో వెళ్లిన 98 భక్తులు ఆదివారం తిరిగి వచ్చారు. అచ్యుతాపురం సబ్ డివిజన్ పరిధిలో భక్తులు రెండు బస్సుల్లో తిరుమల వెళ్లి వచ్చారు. ఈ కార్యక్రమంలో బి. వి. రమణ, కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, సూరాడ నూకరాజు, వెన్నెల అప్పలనాయుడు, దొడ్డి కృష్ణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వెలమలు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో ఐక్యతను ప్రదర్శిస్తున్న వెలమ ప్రతినిధులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్‌లో భూములు కోల్పోయిన వారిలో వెలమలు ఉన్నప్పటికీ సెజ్‌లో ఉపాధి అవకాశాలు మాత్రం రాలేదని వెలమ కుల ప్రతినిధులు పేర్కొన్నారు. అచ్యుతాపురంలో ఆదివారం నిర్వహించిన వెలమల ఆత్మీయ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. వెలమలు ఐక్యంగా ఉండాలని తీర్మానించారు. త్వరలోనే వెలమల సామాజిక భవన నిర్మాణానికి స్థలాన్ని సమీకరించాలని నిర్ణయించారు. రాజకీయంగా, ఆర్థికంగా వెలమలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రొంగలి జగన్నాథం, లాలం భాస్కర్‌రావుతో పాటు జెడ్పీటీసీ లాలం రాంబాబు, దొప్పెర్ల సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, విమలనాయుడు, సంతోష్,నాయుడు తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో పెదరామ తీర్థ మహోత్సవం



పెదరామ తీర్థ మహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : ప్రశాంతమైన వాతావరణంలో పండగలను నిర్వహించుకుని, ప్రభుత్వానికి సహకరించాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం పెదరామస్వామి దేవాలయంలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే పెదరామ తీర్థ మహోత్సవ కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. రెండు రోజులపాటు నిర్వహించే తీర్థమహోత్సవాల ఏర్పాట్ల విషయమై ఆరా తీశారు. మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, కర్రి శివుడు, పెంటకోట చిన్న, సూరిశెట్టి బంగారినాయుడు, కాంద్రేగుల కుమార్, కోరుబిల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.